# విశాల భారతి
తెలుగు దినపత్రిక

16-12-2025

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:3 సంచిక: 346


## ఓటర్ ఫిరాయింపు..!

ఫిరాయింపు ఎమ్మెల్యేలున్నచోట సానుకూలంగా ఫలితాలు
గ్రామీణ ప్రాంతాలున్న 8 నియోజకవర్గాలు
రాజేందర్‌నగర్ పరిధిలో శంషాబాద్ మండలం
21 గ్రామాలకుగాను 12 కాంగ్రెస్ ఖాతాలో

02



# కాంగ్రెస్.. డేంజర్ బెల్స్!





**తెలంగాణ వ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఊరటను ఇస్తూనే, అంతర్లీనంగా తీవ్రమైన హెచ్చరికలను కూడా జారీ చేశాయి. ఇప్పటివరకూ వెలువడిన రెండు విడతల ఫలితాలను పరిశీలిస్తే, అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ అగ్రస్థానంలో నిలిచిన మాట వాస్తవమే. కానీ, క్షేత్రస్థాయిలో చోటుచేసుకున్న పరిణామాలు, గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే.. అధికార పార్టీ సాధించిన ఈ విజయం బలుపు కాదని, కేవలం వాపు మాత్రమేనన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.**

పంచాయతీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ఊరటనిచ్చాయి
కానీ అంతర్లీనంగా తీవ్రమైన హెచ్చరికలను జారీ చేశాయి
అధికారంలో ఉన్న పార్టీకి ఏకపక్ష విజయాలు దక్కడం పరిపాటి
పథకాలు అధికార పార్టీ వారికే దక్కుతాయని మొగ్గు చూపుతారు
కాంగ్రెస్ పార్టీ సుమారు 50 శాతం స్థానాల్లో విజయం సాధించింది
బీఆర్ఎస్ 40 శాతానికి పైగా స్థానాల్లో గెలుపొందడం గమనార్హం
కాంగ్రెస్‌కి ఈ ఎన్నికలు అతిపెద్ద ఆందోళన మిగాల్చాయి
రాష్ట్రంలో చక్రం తిప్పుతామనుకున్న నేతలకు మొండిచేయి ఎదురైంది
అలానే సోమార్‌పేటలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి దారుణానికి పాల్పడ్డాడు
ఇప్పటికైనా లోపాలను సరిదిద్దుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు దక్కడం పరిపాటి. అభివృద్ధి నిధులు, ప్రభుత్వ పథకాలు అధికార పార్టీ మద్దతుదారులకే అందుతాయన్న నమ్మకంతో గ్రామీణ ఓటర్లు అధికార పక్షం వైపు మొగ్గు చూపుతారు. ఈ కోణంలో చూస్తే కాంగ్రెస్ పార్టీ స్వీప్ చేయాల్సి ఉంది. కానీ, తాజా ఫలితాలు ఆ అంచనాలను తారుమారు చేశాయి. కాంగ్రెస్ పార్టీ సుమారు 50 శాతం స్థానాల్లో విజయం సాధిస్తే, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ 40 శాతానికి పైగా స్థానాల్లో గెలుపొందడం గమనార్హం. కేవలం 10 శాతం ఓట్ల తేడా మాత్రమే ఉండటం అధికార పార్టీ డొల్లతనాన్ని బయటపెడుతోంది. కాంగ్రెస్ విజయం వెనుక ఆ పార్టీ సంస్థాగత బలం కంటే, 'అధికారంలో ఉన్నాం' అన్న సానుకూలత మాత్రమే ఎక్కువగా పనిచేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలో లేకపోయి ఉంటే, ఈ ఫలితాలు పూర్తిగా భిన్నంగా ఉండేవని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు మిగిల్చిన అతిపెద్ద ఆందోళన.. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరు. రాష్ట్రంలో చక్రం తిప్పుతున్నామని భావిస్తున్న పలువురు మంత్రులు, కీలక ఎమ్మెల్యేల సొంత గ్రామాలు, సొంత నియోజకవర్గాల్లోనే కాంగ్రెస్ మద్దతుదారులు ఓటమి పాలయ్యారు. అధికార పార్టీ నేతలు తమ సొంత గడ్డపైనే పట్టు కోల్పోవడం, అక్కడ బీఆర్ఎస్ మద్దతుదారులు జెండా ఎగురవేయడం కాంగ్రెస్ అధిష్టానానికి మింగుడుపడని విషయం. ఇది కేవలం ఓటమి మాత్రమే కాదు, క్షేత్రస్థాయిలో

మిగతా 3లో..

## సర్పంచ్‌లను వేధిస్తే తాట తీస్తా

తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు కాకరేపుతున్నాయి
కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌ల మధ్య మాటల యుద్ధం
ఈ నేపథ్యంలో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు
సర్పంచ్ లను వేధిస్తే తాట తీస్తామంటూ వార్నింగ్
ప్రతి జిల్లాలో 'లీగల్ సెల్' ఏర్పాటు చేస్తామన్నారు
కాంగ్రెస్ పై వ్యతిరేకత స్పష్టంగా తెలుస్తొందన్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికలు కాకరేపుతున్నాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌ల మధ్య మాటల యుద్ధం నడుస్తుంది. నువ్వా నేనా అన్న విధంగా నేతలు మాటల తూటాలు పేల్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల తెలంగాణల రెండు విడతల్లో ఎన్నికలు జరిగాయి. పలు చోట్ల బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు కూడా విజయాన్నిసాధించారు. కాంగ్రెస్ పార్టీకు పరాభవాన్ని మిగిల్చారు. అయితే.. కొన్ని చోట్ల మాత్రం గెల్చిన బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన వారిపై దాడులు, ఒకవేళ గెల్చిన కూడా వారిని ఏదో విధంగా పక్కకు తప్పుకునేలా వేధింపులకు గురిచేస్తున్న ఘటనలు పలుచోట్ల వెలుగులోకి వస్తున్నాయి. దీనిపై తాజాగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. సర్పంచ్‌లను వేధిస్తే తాట తీస్తామంటూ కాంగ్రెస్ ను ఏకీపారేశారు. ఇక మీదట తెలంగాణలో సర్పంచ్‌లను వేధిస్తే ఊరుకోమన్నారు. అదే విధంగా ప్రతి జిల్లాలో 'లీగల్ సెల్' ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దన్నారు. అన్ని విధాలుగా న్యాయపరంగా అండగా ఉంటామన్నారు. రెండెళ్లలోనే కాంగ్రెస్ పై వ్యతిరేకత స్పష్టంగా తెలుస్తొందన్నారు. ఈ క్రమంలో కేటీఆర్.. సిరిసిల్లలో నూతన సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని తెల్చి చెప్పారు. సర్పంచ్ లు, అభ్యర్థుల రక్షణ కోసం ప్రతి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేటీఆర్ ప్రకటించారు. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులను అభినందిస్తూ, వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

ప్రతి జిల్లాలో సర్పంచుల కోసం లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బిఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

మిగతా 2లో..




## విలీనం దుమారం

హైదరాబాద్ నగర పరిపాలనలో కీలక సంస్కరణలు
మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరిస్తూ నిర్ణయం
డివిజన్ల సంఖ్య పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్
ప్రజల అభ్యంతరాలను ప్రభుత్వం పట్టించుకోలేదని పిటిషన్
హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు
వార్డుల పునర్విభజన ఏకపక్షంగా జరిగిందని ఆరోపణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ నగర పరిపాలనలో కీలక సంస్కరణలు చేపట్టిన విషయం తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరిస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా భవిష్యత్తులో జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని వార్డుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 150 నుంచి ఏకంగా 300కు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు డిసెంబర్ 8న గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలో డివిజన్ల సంఖ్య పెంపును సవాల్ చేస్తూ.. వినయ్‌కుమార్ అనే వ్యక్తి సోమవారం (డిసెంబర్ 15) తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డివిజన్ల పునర్విభజన సమయంలో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను ప్రభుత్వం పట్టించుకోలేదని పిటిషన్‌లో ఆరోపించారు.

మిగతా 3లో..

## మావోయిస్టుల ఆస్తులు సీజ్..!

- కనుమరుగవుతున్న మావోయిస్టు ఉద్యమం
- ఆర్థిక మూలాలను దెబ్బతీస్తోన్న కేంద్రం
- మార్చి నాటికి మావోయిస్టుల అంతమే లక్ష్యం
- వందల మంది పర్యాటకులు పరుగులు తీశారు
- కేంద్రం తీరుపై ప్రజాసంఘాలు విమర్శలు
- 92కోట్ల రూపాయల అన్నల ఆస్తులను స్వాధీనం

02

## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తా..!

- కవిత రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటున్నారు
- సొంతంగా పార్టీ పెట్టే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం
- ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు
- ఎక్స్ వేదికగా ఆస్క్ కవిత పేరుతో క్వశ్చన్ అవర్
- 2029లో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు
- రైతుల ఆత్మహత్యలపై కవిత ఆవేదన వ్యక్తం



02

## పాటకి ప్రాంతమా..?

- రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ
- హాజరైన వెంకయ్యనాయుడు, ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు
- పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు
- మినిస్టర్ శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు
- సంగీతానికి హద్దులు లేవని ఎస్పీ నిరూపించారు
- ఆయన గాత్రం భావోద్వేగాలను జీవనాన్ని నింపింది

02



## బీజేపీ బిగ్ బాస్‌గా నితిన్ నబీన్



- బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు
- ఈ పదవిని చేపట్టిన రెండో నేతగా ఆయన నిలిచారు
- ఈ బాధ్యతలు నిర్వహించిన ఏకైక నేత జేపీ నడ్డా
- 2019 తర్వాత ఈ పదవి పార్టీ చీఫ్‌గా దశగా మారింది
- తాత్కాలిక వ్యవస్థేనని పార్టీ నేతలు చెబుతున్నారు
- నబీన్ ప్రస్తుతం బిహార్ రాష్ట్ర క్యాబినెట్‌లో ఉన్నారు

**విశాలభారతి, నేషనల్:** బీజేపీ చరిత్రలో కీలకమైన పరిణామంగా జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు పదవికి నితిన్ నబీన్ ఎంపికయ్యారు. ఈ పదవిని చేపట్టిన రెండో నేతగా ఆయన నిలిచారు. ఇంతకు ముందు ఈ బాధ్యతలు నిర్వహించిన ఏకైక నేత ప్రస్తుత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉన్నారు. మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. బీజేపీ రాజ్యాంగంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అనే ప్రత్యేక నిబంధన లేకపోయినప్పటికీ.. 2019 తర్వాత ఈ పదవి పార్టీ చీఫ్‌గా

మిగతా 3లో..

# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తా..!

- కవిత రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటున్నారు
- సొంతంగా పార్టీ పెట్టే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం
- ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు
- ఎక్స్ వేదికగా ఆస్క్ కవిత పేరుతో క్వశ్చన్ అవర్
- 2029లో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు
- రైతుల ఆత్మహత్యలపై కవిత ఆవేదన వ్యక్తం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గత కొద్ది కాలంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటున్నారు. కుటుంబం, బీఆర్ఎస్ పార్టీ నుంచి బయట వచ్చి.. ఆ పార్టీ నాయకులపై తీవ్రంగా విమర్శలు చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. మరోవైపు అధికార పక్షంపై కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో కవిత సొంతంగా పార్టీ పెట్టే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. 2029లో తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఎక్స్ వేదికగా ఆస్క్ కవిత పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహించిన సందర్భంగా కవిత ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ముందుగానే ప్రచారం చేసి..ప్రశ్నలు అడగాలని పిలుపునిచ్చారు. పెద్ద ఎత్తున అడిగిన ప్రశ్నలకు.. కవిత సమాధానాలు ఇచ్చారు. తెలంగాణకు సంబంధించిన కీలకమైన అంశాలపై సమాధానాలు ఇచ్చారు. ఓ నెటిజన్ ముఖ్యమంత్రి అయితే ప్రాధాన్యత అంశంగా ఏది తీసుకుంటారని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు సమాధానంగా కవిత.. ఉచిత చదువుల తెలంగాణనే తీసుకుంటానని చెప్పారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు రూపాయి కూడా కట్టకుండా చేయాలనుంటానని తెలిపారు.

రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూడంటపైనా కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తన యాత్రలో కొంత మంది ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను కలిశానన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ఇలా జరుగుతున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద అభిప్రాయం చెప్పాలని ఓ నెటిజన్ కోరారు. దానికి కవిత మూడు ముక్కల్లో సమాధానం ఇచ్చారు. జాగృతి సంస్థపై మరికొంత మంది ప్రశ్నలు అడిగారు. జాగృతిని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పని చేసేలా తీర్చిదిద్దుతానని కవిత తెలిపారు. జాగృతి సభ్యత్వాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఇంకా పలు ప్రశ్నలకు కవిత సమాధానం ఇచ్చారు. సామాజిక తెలంగాణయే తన లక్ష్యమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో తాము పోటీలో ఉంటామని తేల్చిచెప్పారు. రజలు సూచించిన పేరునే పార్టీకి పెడుతామన్నారు. తెలంగాణ సాధికారిత సాధించాలంటే మెరుగైన, నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం ప్రజలకు అందాలని అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించటమే తన ప్రథమ ప్రాధాన్యమని చెప్పారు. ఉద్యోగాలతో పాటు వారికి భద్రత కూడా కల్పించాలన్నారు. సామాజిక న్యాయం కోసం జాగృతి పోరాటం కొనసాగుతుందన్నారు. క్రమంగా జాగృతిని చాలా బలంగా తయారు చేస్తామని చెప్పారు.

ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకపోవటంతో లక్షలాది మంది విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం ఆడపిల్లల చదువుకు మరణశాసనంగా మారిందన్నారు. ఇక రైతుల ఆత్మహత్యలు చాలా బాధకరమని చెప్పారు. కాంగ్రెస్ వచ్చాక వరుసగా రైతుల ఆత్మహత్యలు కొనసాగటం బాధకరమన్నారు. ప్రభుత్వం చేతగాని, నిర్లక్ష్య వైఖరిని ఇది నిదర్శనమని చెప్పారు. ఇక ఫార్మా సిటీ కోసం తీసుకున్న భూముల్లో ఫ్యూచర్ సిటీ అంటూ హడావుడి చేయటంపై మండిపడ్డారు. తర్వలోనే అక్కడి రైతులకు మద్దతుగా పోరాటం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ వచ్చాక సింగరేణి సంస్థను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎంఎస్ తో కలిసి సింగరేణి కోసం ప్రభుత్వం పై పోరాటం చేస్తామన్నారు. హైదరాబాద్ లో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవటంపై కవిత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెస్ట్ సిటీ పై పెట్టిన శ్రద్ధ, ఈస్ట్ సిటీ ని సిటీ అభివృద్ధి చేయటంలో పెట్టలేదన్నారు. కవిత వ్యక్తిగత అభిరుచులకు సంబంధించి పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. రామ్ చరణ్ గురించి ఒక్క మాటలో చెప్పాలని అడగగా...చాలా హంబుల్ గా ఉండే వ్యక్తి. మంచి డ్యాన్సర్ అన్నారు. ఐతే తాను చిరంజీవి అభిమానిని అని...చిరంజీవి తర్వాతే రామ్ చరణ్ అన్నారు. చిన్నప్పుడు ఎర్రమంజిల్ లో గడిపిన క్షణాలు తనకు చాలా సంతోషానిచ్చాయని అన్నారు. ఐతే రాజకీయాలు కాకుండా ఏదైనా బిజినెస్ పై దృష్టి పెట్టాలంటూ ఓ నెటిజన్ సూచించగా... అందుకు కవిత కూల్ గా అన్సర్ చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి చాలా నెగిటివిటీ ఉంటుందని దాన్ని పట్టించుకోకుండా మంచిగా ఆలోచించాలని సూచించారు.

# సర్పంచ్‌లను వేధిస్తే తాట తీస్తా

"మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించాలన్నారు. మీ కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అరగంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుందన్నారు. కోర్టు ద్వారా మన హక్కుల కోసం కొట్లాడుదామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం గ్రామాలకు కావాల్సిన నిధులను ఎవరు కూడా ఆపలేరని కేటీఆర్ అన్నారు. ప్రజలకు అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్లు, మహిళలకు తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 40 నుండి 70 శాతం స్థానాల్లో బిఆర్ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తిలో కిడ్నాప్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ..కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం చేసిన ప్రజల వ్యతిరేకత నుంచి కాంగ్రెస్ని కాపాడలేకపోయారని కేటీఆర్ అన్నారు. మంత్రులు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నాయకుల అరాచకాలకు బెదరకుండా భయపడకుండా ప్రజలు మా పార్టీ నేతలు నిలబడ్డారని... అందుకే అత్యధిక స్థానాల్లో ప్రతిపక్షంలో ఉన్న మా పార్టీని గెలిపించారని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పట్ల నెలకొన్న తీవ్రమైన అసంతృప్తికి వ్యతిరేకతకు పంచాయతీరాజ్ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని కేటీఆర్ అన్నారు.



అదే విధంగా.. పదవి అనేది ముఖ్యం కాదని.. పనే ముఖ్యం సర్పంచులు కేవలం పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామ అభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. సూర్యాపేట జిల్లాలోని 'ఏపూర్' గ్రామాన్ని ఉదాహరణగా తీసుకుంటూ.. అక్కడ చెక్ డ్యాంలు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం వంటి నిర్మాణాలతో ఆ గ్రామం దేశంలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందిందని అన్నారు. ఐదేళ్ల తర్వాత ప్రజలు మనల్ని గుర్తుపెట్టుకోవాలంటే, మనం చేసిన పనే మనకు శ్రీరామరక్ష అని హితవు పలికారు. పల్లె ప్రగతి ద్వారా ప్రతి ఊరిలో నర్సరీ, డంప్ యార్డ్, ట్రాక్టర్, వైకుంఠధామం వంటివి ఏర్పాటు చేసి గ్రామాల రూపురేఖలు మార్చామని తెలిపారు. గెలిచిన సర్పంచులకు త్వరలో శిక్షణా తరగతులు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే, గెలిచిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పంచాయతీరాజ్ చట్టం, విధులు, హక్కులపై అవగాహన కల్పించేందుకు నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని కేటీఆర్ వెల్లడించారు. మిగిలిన విడత ఎన్నికల్లోనూ పార్టీ శ్రేణులు కష్టపడి గులాబీ జెండా ఎగురవేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ఓటర్ ఫిరాయింపు..!

- ఫిరాయింపు ఎమ్మెల్యేలున్నచోట సానుకూలంగా ఫలితాలు
- గ్రామీణ ప్రాంతాలున్న 8 నియోజకవర్గాలు
- రాజేంద్రనగర్ పరిధిలో శంషాబాద్ మండలం
- 21 గ్రామాలకుగాను 12 కాంగ్రెస్ ఖాతాలో
- అధికార కాంగ్రెస్ ఆధిపత్యం ప్రదర్శించింది
- బీఆర్ఎస్ కూడా బాగానే రాణించింది
- ఇండిపెండెంట్స్ నాలుగు చోట్ల గెలిచారు



**విశాలభారతి, విశాలభారతి:**

తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితేంటి? గ్రామీణ ప్రజానీకం వాళ్ళని నమ్మారా? లేక మేం నమ్మి ఓట్లేస్తే మీ ఇష్టం వచ్చినట్టు పార్టీ మారిపోయారని తిరస్కరించారా? ఏ నియోజకవర్గంలో ఎవరి సంగతి ఎలా ఉంది? వాళ్ళు కాంగ్రెస్‌కు ప్లస్ అయ్యారా? లేక మైనస్‌గా మారిపోయారా? లెట్స్ వాచ్. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రెండు విడతలు ముగియగా వచ్చే 17న మూడో విడత జరుగుతుంది. మొదటి రెండు విడతల్లో అధికార కాంగ్రెస్ ఆధిపత్యం ప్రదర్శించగా ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు కూడా చెప్పుకోతగ్గ స్థానాలు దక్కాయి. కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు గెలిచినప్పటికీ, గతంలో బీఆర్ఎస్ సాధించినట్టుగా వార్ వన్‌సైడ్ జరగలేదని, ప్రభుత్వం మీద వ్యతిరేకత పెరుగుతోందనడానికి ఇది నిదర్శనం అంటున్నాయి ప్రతిపక్షాలు. కానీ, మాలో మాకున్న గ్రూప్ వార్ కారణంగానే అలా జరుగుతోందన్నది కాంగ్రెస్ వర్గాల మాట. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పంచాయతీ ఫలితాలు ఎలా ఉన్నాయన్న ఇంట్రస్టింగ్ డిస్కషన్ జరుగుతోంది. వాళ్ళ మీద ప్రజల ప్రేమ అప్పటిలాగే ఉందా? లేక వ్యతిరేకత పెరిగిందా అన్నది ఆసక్తికరంగా మారింది.

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, అరికెపుడి గాంధీల నియోజకవర్గాలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్నాయి కాబట్టి వాళ్ళకు సంబంధం లేదుగానీ మిగతా 8మంది బొమ్మ ఎలా ఉందని ఆరా తీస్తున్నాయి రాజకీయవర్గాలు. రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నియోజకవర్గ పరిధిలో ఒక మండలంలో మాత్రమే సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. శంషాబాద్ మండలంలోని 21 గ్రామాలకుగాను కాంగ్రెస్ 12, బీఆర్ఎస్ 3,బీజేపీ రెండు గ్రామాల్ని దక్కించుకున్నాయి. ఇండిపెండెంట్స్ నాలుగు చోట్ల గెలిచారు. సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అసలు సర్పంచ్ ఎన్నికలనే పట్టించుకోలేదు. ఆయన నియోజకవర్గంలోని 11 గ్రామాలకు గాను 9 స్థానాల్లో కాంగ్రెస్, 2 చోట్ల బీఆర్ఎస్ గెలిచాయి. అయితే నియోజకవర్గ కాంగ్రెస్ కీలక నేత కాటా శ్రీనివాస్ అంతా తానై చూసుకోవడంతో ఈ ఫలితాలు వచ్చాయని చెబుతున్నారు కాంగ్రెస్ నేతలు.

ఇక రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అడపా దడపా ప్రచారం చేశారు. ఇక్కడ 16చోట్ల కాంగ్రెస్, 3 బీఆర్ఎస్, 3 బీజేపీ, ఇతరులు మూడు చోట్ల గెలిచారు. గద్వాల నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 131 గ్రామ పంచాయతీలు ఉంటే...ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి వర్గం 72 స్థానాలు, కాంగ్రెస్ నేత సరిత వర్గం 35 గ్రామాల్ని గెలుచుకున్నాయి. బీఆర్ఎస్ 08, బీజేపీ 9, ఇతరులు 7 చోట్ల గెలిచారు. భద్రాచలం నియోజకవర్గంలో ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుకు ఎదురుదెబ్బ తగిలింది. ఆయన స్వగ్రామం చిన్నబండిరేవు సర్పంచ్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. జగిత్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టుగా ఎన్నికలు జరిగాయి. మొత్తం 101 సర్పంచ్ స్థానాలు ఉంటే 84 కాంగ్రెస్, 5 బీఆర్ఎస్, 9 బిజెపి, కైవసం చేసుకోగా.. ఇతరులు మూడు చోట్ల గెలుపొందారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే సంజయ్ వర్సెస్ మాజీ మంత్రి జీవన్ రెడ్డి మధ్య ఆధిపత్య పోరు జరుగుతోంది. దీంతో కేడర్‌లో కాస్త గందరగోళం కూడా ఉందట. బాన్సువాడ నియోజకవర్గంలో 137 గ్రామపంచాయతీలు ఉండగా మొదటి విడతలో 80 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 74 ఊళ్ళను కాంగ్రెస్ గెలిచింది.

అయితే స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి, మరో నేత ఏనుగు రవీందర్ రెడ్డి గ్రూపులు ఉన్నాయి. ఎవరికి వారే సర్పంచ్ అభ్యర్థులను బరిలో దింపారు. గెలిచిన వారు మా అభ్యర్థులే అని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారు. స్టేషన్ ఘన్పూర్ నియోజక వర్గంలో పార్టీ మారిన కడియం శ్రీహరి తన పట్టు నిలుపుకునే ప్రయత్నం చేశారు. అటు మరోనేత ఇందిర వర్గంతో ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేసుకున్న కడియం...పట్టు నిలుపుకున్నారన్న అభిప్రాయం ఉంది. ఇక్కడ 138 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగ్గా... కడియం శ్రీహరి బలపరిచిన అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో విజయం సాధించారు. కొన్నిచోట్ల రెబెల్స్ గెలిచినా వాళ్ళంతా తిరిగి ఆయన దగ్గరికే రావడంతో లైన్ క్లియరైపోయింది. మొత్తం 76 చోట్ల కాంగ్రెస్, 12 సీట్లలో రెబెల్స్ గెలవగా అన్నీ కాంగ్రెస్ ఖాతాలో పడిపోయాయి. ఇక్కడ బీఆర్ఎస్‌కు 36 పంచాయతీలు దక్కాయి. ఇంకో విడత ప్రజా తీర్పు ఉన్నందున హోవరాల్‌గా ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో ప్రజలు ఎలా రియాక్ట్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది.

# పాటకి ప్రాంతమా..?

- రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ
- హాజరైన వెంకయ్యనాయుడు, ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు
- పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు
- మినిస్టర్ శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు
- సంగీతానికి హద్దులు లేవని ఎస్పీ నిరూపించారు
- ఆయన గాత్రం భావోద్వేగాలను జీవనాన్ని నింపింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఆవిష్కరణపై వివాదం నెలకొన్న సంగతి తెలిసందే. ఆయన విగ్రహం పెట్టడాన్ని తెలంగాణ వాదులు వ్యతిరేకిస్తున్నారు. సోమవారం ఆయన విగ్రహం ఆవిష్కరణ నేపథ్యంలో నిరసన తెలిపేందుకు తెలంగాణ వాదులు సిద్ధమయ్యారు. దీంతో వారిని పోలీసులు హౌస్ అరెస్టు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా కార్యక్రమానికి ఎలాంటి అవాంతరాలు కలగకుండా రవీంద్ర భారతితో పాటు.. పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు. అయితే షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించాల్సి ఉన్నా.. ఆయన ఢిల్లీకి వెళ్లడంతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సోమవారం.. ఎస్పీ బాలు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతిలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాలసుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నెల్లూరులోని తన ఇంటిని వేద పాఠశాలకు బాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. బాలు మన మధ్య లేకున్నా.. పాట రూపంలో మనతోనే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు.

ఐటీ మినిస్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ సంగీతానికి హద్దులు లేవని నిరూపిస్తూ, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం గారి పేరు భారతీయ చలనచిత్ర సంగీత చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిపోయిందన్నారు. 14 భారతీయ భాషలలో 40,000కు పైగా పాటలు పాడిన ఆయన గాత్రం భావోద్వేగాలను, జీవనాన్ని నింపింది, తరతరాలుగా ఎప్పటికీ తాజాదనాన్ని నిలుపుకుంటూ ప్రజల హృదయాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంది. ది మ్యూజిక్ గ్రూప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో ఆయన విగ్రహావిష్కరణ కేవలం ఒక శిల్పాన్ని మాత్రమే కాకుండా, సంగీతం, అంకితభావం, వినయం వంటి విలువలను కూడా వేడుకగా జరుపుకుంది.

ఎస్పీబాలు విగ్రహావిష్కరణ సందర్భంగా వివాదంపై ఆయన చెల్లి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ స్పందించారు. ఎస్పీ బాలు గాయకులందరికీ స్ఫూర్తి దాయకం అని అన్న శైలజ.. ఒక అన్నయ్యగా తనకు కూడా ఓ కొత్త మార్గాన్ని ఇచ్చారని చెప్పారు. బాలసుబ్రమణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడించారు. బాలు బతికి ఉన్నపుడే.. ఘంటసాల విగ్రహం పక్కన తన విగ్రహం పెట్టాలని చెప్పినట్లు గుర్తుచేశారు. ఈ క్రమంలో అన్నయ్య విగ్రహం గురించి నిరసనలు తనకు తెలియదని.. విగ్రహ ఏర్పాటులో తన ప్రమేయం ఏమీ లేదని, మొత్తం సంగీతం బృందం కమిటీ చూసుకుందన్నారు. అంతేకాకుండా బాలు గురించి తెలియని వారంటూ ఎవరూ ఉండరన్నారు.

కొన్ని రోజుల క్రితం ఎస్పీ బాలు విగ్రహం ఆవిష్కరణ విషయంపై రవీంద్ర భారతి వద్దకు వచ్చారు బాలు బావమరిది, నటుడు శుభలేఖ సుధాకర్. ఈ సమయంలో ఆయనతో ఉద్యమకారుడు పృథ్వీరాజ్‌తో పాటు మరికొంతమంది వాగ్వాదానికి దిగారు. తెలంగాణలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెట్టడానికి వీలు లేదంటూ హెచ్చరించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని పృథ్వీరాజ్‌తో పాటు మరికొందరు తెలంగాణ ఉద్యమకారులను అక్కడ నుంచి పంపించారు. తెలంగాణ రాష్ట్ర గీతాన్ని పాడటానికి నిరాకరించారని.. అందుకే ఎస్పీ బాలు విగ్రహాన్ని ఎట్టిపరిస్థితిల్లోనూ ఏర్పాటు చేయొద్దంటూ తెలంగాణ వాదులు డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి కళాకారులు చాలా మంది ఉన్నారని, వారి విగ్రహాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ విషయంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూడా తెలంగాణ ఉద్యమకారులకు మద్దతు తెలిపారు. బాలు విగ్రహం రవీంద్ర భారతి వద్ద పెట్టడం సరికాదన్నారు. విగ్రహం పెట్టడానికి వేరే స్థలం చూసుకోవాలని చెప్పారు. సంగీతానికి హద్దులు లేవని నిరూపిస్తూ, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం గారి పేరు భారతీయ చలనచిత్ర సంగీత చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిపోయింది. 14 భారతీయ భాషలలో 40,000కు పైగా పాటలు పాడిన ఆయన గాత్రం భావోద్వేగాలను, జీవనాన్ని నింపింది, తరతరాలుగా ఎప్పటికీ తాజాదనాన్ని నిలుపుకుంటూ ప్రజల హృదయాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంది.

ది మ్యూజిక్ గ్రూప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో ఆయన విగ్రహావిష్కరణ కేవలం ఒక శిల్పాన్ని మాత్రమే కాకుండా, సంగీతం, అంకితభావం మరియు వినయం వంటి విలువలను కూడా వేడుకగా జరుపుకుంది. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు గారితో పాటు ఇతర ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం, స్ఫూర్తిని పంచుతూనే ఉన్న ఒక వారసత్వానికి గౌరవ వందనం అర్పించింది.



# మావోయిస్టుల ఆస్తులు సీజ్..!

**విశాలభారతి, విశాలభారతి:**

పట్టు పట్టరాదు.. పట్టి విడుదరాాదు.. పట్టి విడువటకన్నా.. పడి చచ్చుటమేలయా.. అన్న సామెతను కార్యరూపంలో పెట్టి చేసి మరీ చూపిస్తోంది కేంద్ర హోంశాఖ. దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టుల అంతమే లక్ష్యంగా పెట్టుకుని, అదే పట్టుతో ముందు సాగుతూ ,దాదాపు లక్ష్యానికి చేరువలోకి వచ్చేసింది. మావోస్టుల విషయంలో కేంద్రం తీరుపై ప్రజాసంఘాలు మండిపడుతున్నా, మానవ హక్కుల ఉల్లంఘన అంటూ ఉద్యమనేతలు గోలపెడుతున్నా డోంట్ కేర్ అంటూ ముందుకు దూసుకుపోతోంది. ఏ ఉద్యమైనా ఆర్థిక మూలాలను దెబ్బకొడితే, ఆ ప్రభావం , ఆయా ఉద్యమాాలపై తీవ్రంగా ఉంటుంది. అందులోనూ జనజీవన స్రవంతికి దూరంగా అడవుల్లో తిరుగుతున్న అన్నలపై ఇంకాస్త ఎక్కువే అని చెప్పవచ్చు. తాజాగా మావోయిస్టుల ఆస్తులను సీజ్ చేసినట్లు కేంద్రం అధికారికంగా ప్రకటించడం సంచలనంగా మారింది. దేశ వ్యాప్తంగా ఏకంగా 92కోట్ల రూపాయల అన్నల ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో , ఇప్పటికే కొనఊపిరితో ఉన్న మావోయిస్టు ఉద్యమం, ఇక దాదాపు కనుమరుగైయ్యే పరిస్థితులు ఏర్పాడ్డాయి.

దేశంలో మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర హోంశాఖ, పలు దర్యాప్తు సంస్థలు మొదటి నుండి వ్యూహాత్మకంగా పనిచేస్తున్నాయి. ఓవైపు ఆపరేషన్ కగార్ పేరుతో భారీగా భద్రతా బలగాల కూంబింగ్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మావోల గుర్తింపు, ఎన్ కౌంటర్ ఇలా దండకారణ్యంలో అన్నల ఏరివేత ప్రక్రియ కొనసాగిస్తూనే , మరోవైపు అంతే స్థాయిలో మావోయిస్టుల ఆస్తులపై, ఆర్థిక మూలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ ఐఏ 40కోట్ల రూపాయల మావోయిస్టు ఆస్దులను సీజ్ చేసింది. ఢిల్లీ పోలీసులు మరో 40కోట్ల రూపాయల విలువైన ఆస్తులు జప్తు చేశారు. వీరితో పాటు ఎన్ఫోర్స్ మెంట్ డైరక్టరేట్ మరో 12 కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఇలా మొత్తంగా ఇప్పటి వరకూ 92 కోట్ల రూపాయలు మావోయిస్టు ఆస్తులను, వారి మనుగడకు కీలకంగా మారిన ఆర్థిక మూలాలను కట్టడి చేస్తోంది కేంద్రం ప్రభుత్వం.

ఇదిలా ఉంటే ఆపరేషన్ కగార్ కు ముందు , తరువాత మావోయిస్టుల ప్రాబల్యంపై కూడా కేంద్రం కోలుకోలేని దెబ్బకొట్టింది. 2014లో దేశంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు 126 జిల్లాలు ఉండగా, 2025 నాటి ఆ సంఖ్య 11 జిల్లాలకు మాత్రమే పరిమితమైయ్యింది. 2014లో మావోయిస్టు అత్యంత ప్రభావిత జిల్లాలు 36 ఉండేవి, అవి కాస్తా 2025 నాటి కేవలం 3 జిల్లాలకు చేరుకున్నాయి. ఇంతలా మావోల ప్రభావంపై కోలుకోలేని దెబ్బకొట్టింది హోంశాఖ.ఈ ఒక్క ఏడాదిలోనే ఏకంగా 317 మంది మావోయిస్టులు ఎన్ కౌంటర్ లో ప్రాణాలు కోల్పోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటి వరకూ 862 మంది మావోస్టులు అరెస్ట్ అయ్యారు.

1973 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఒక్క అక్టోబర్ నెలలోనే చత్తీస్ ఘడ్, మహారాష్ట్రలలో 258 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు కేంద్ర అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ఇంతా మావోయిస్టు ఉద్యమం కుదేలవడానికి ప్రధాన కారణం , మావోయిస్టుల కీలక నేతలను కేంద్రం టార్గెట్ చేయడం. 2024 నుండి ఇప్పటి వరకూ 28 మంది హిడ్మా వంటి మావోయిస్టు అగ్రనేతలు వివిధ ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. ఇలా దెబ్బమీద దెబ్బ అన్నట్లు ఏకంగా 60 ఏళ్ల నాటి సాయుధపోరాటం, మావోయిస్టుల ఉద్యమం అంతిమ దశకు చేరుకుంది. అనుకున్న లక్ష్యాన్ని పెట్టుకున్న గడువులోపే పూర్తి చేస్తామనే ధీమాతో కేంద్రం దూసుకుపోతోంది.

# కాంగ్రెస్.. డేంజర్ బెల్స్!

( మొదటిపేజీ తరువాయి )

ఈ అమానుష దాడికి నిరసనగా బాధితులు, గ్రామస్థులు ఎల్లారెడ్డిలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ దాడికి వ్యతిరేకంగా గ్రామస్థులంతా ఏకమై ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కురుమ సాయిబాబా రాజీనామా చేయాలని ప్రధానంగా డిమాండ్ చేస్తూ, ఎల్లారెడ్డిబాన్సువాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రస్తుతం సోమార్పేట గ్రామంలో పోలీసులు భారీగా మోహరించి పికెటింగ్ ఏర్పాటు చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సర్పంచ్ పదవికి రాజీనామా చేయించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు, దీంతో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే కొనసాగుతోంది. మొత్తానికి, కాంగ్రెస్ సాధించిన ఈ విజయం అంకెల గారడీలో గొప్పగా కనిపించవచ్చు కానీ, వాస్తవంలో అది నిలకడ లేని విజయమని, పార్టీ ఇప్పటికైనా లోపాలను సరిదిద్దుకోకపోతే రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

నాయకత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి నిదర్శనం. నేతల అతి విశ్వాసం, గ్రూపు తగాదాలు, క్షేత్రస్థాయి కార్యకర్తలను విస్మరించడం వంటి కారణాలే ఈ ఫలితాలకు దారితీశాయని స్పష్టమవుతోంది.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓటముల తర్వాత డీలా పడ్డ బీఆర్ఎస్ శ్రేణులకు ఈ పంచాయతీ ఎన్నికలు టానిక్‌లా పనిచేశాయి. ప్రతిపక్షంలో ఉండి, అధికార పార్టీని ఎదుర్కొని మరీ 40 శాతానికి పైగా స్థానాలను దక్కించుకోవడం ఆషామాషీ విషయం కాదు. గ్రామీణ స్థాయి క్యాడర్ బీఆర్ఎస్‌కు ఇంకా బలంగానే ఉందని ఈ ఫలితాలు రుజువు చేశాయి. కాంగ్రెస్ వైఫల్యాలను, ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా




మలుచుకోవడంలో బీఆర్ఎస్ స్థానిక నాయకత్వం సఫలమైంది. ఈ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా ఒక మేలుకొలుపు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతపై దృష్టి సారించకపోవడం, నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు జనం ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకతతో లేకపోయినా, ఈ ఫలితాలు మాత్రం భవిష్యత్తు రాజకీయాలకు ప్రమాద ఘంటికలే. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో ప్రతిపక్షం బలంగా ఉంటే, అది ప్రభుత్వ పథకాల అమలులోనూ, వచ్చే ఎన్నికల్లోనూ అధికార పార్టీకి పెద్ద తలనొప్పిగా మారుతుంది. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డికి సొంతగడ్డపైనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆమె స్వగ్రామమైన తొర్రూరు మండలం చెర్లపాలెంలో ఆమె బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఓటమిపాలయ్యారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. ఝాన్సీరెడ్డి అధికారికంగా బలపరిచిన అభ్యర్థి కిరణ్‌పై.. రెబల్ నేత, తొర్రూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుపతి రెడ్డి వర్గానికి చెందిన మహేందర్ ఘన విజయం సాధించారు. ఝాన్సీరెడ్డి



అభ్యర్థి ఓడిపోవడంతో గ్రామస్తులు, తిరుపతి రెడ్డి వర్గీయులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. ఝాన్సీ రెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఆమె నియంతృత్వ పోకడల వల్ల అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆమె తన ఒంటెద్దు పోకడలు మాని, తీరు మార్చుకోవాలని హితవు పలికారు. సొంతూరులో రెబల్ అభ్యర్థి గెలుపు ఝాన్సీరెడ్డికి మింగుడు పడని అంశంగా మారింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేట గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి పాపయ్య విజయం సాధించిన వెంటనే, ఆయన సోదరుడు చిరంజీవి గ్రామంలో వీరంగం సృష్టించాడు. తమపైనే పోటీ చేశారనే కక్షతో చిరంజీవి ప్రత్యర్థి అభ్యర్థి రాజు కుటుంబంపై ఏకంగా ట్రాక్టర్‌తో దాడికి పాల్పడ్డాడు. ఈ దారుణ సంఘటనలో బాలమణి, భారతి, సత్తవ్వ, శారదలకు తీవ్ర గాయాలయ్యాయి, వారి పరిస్థితి విషమంగా ఉండటంతో తక్షణమే హైదరాబాద్‌కు తరలించారు.

# విలీనం దుమారం

( మొదటిపేజీ తరువాయి )

ఈ విషయాన్ని అత్యవసరంగా విచారించాలని హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. డివిజన్ల పునర్విభజనలో అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. వార్డుల పునర్విభజన అసంబద్ధంగా, ఏకపక్షంగా జరిగిందని ఆరోపించారు. భౌగోళిక సౌలభ్యం, జనాభా, పరిపాలనా సమతుల్యతను పక్కనపెట్టి.. వార్డుల డీలిమిటేషన్ చేశారని పిటిషన్‌లో ఆరోపించారు. అయితే కొన్ని ప్రాంతాలకు అన్యాయం జరిగేలా.. మరికొన్ని ప్రాంతాలకు లాభం చేకూర్చేలా వార్డుల విభజన చేశారని ఆరోపణ గుప్పించారు. ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. మరోవైపు, రాంనగర్ డివిజన్‌పై తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. వినయ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణకు స్వీకరించడం గమనార్హం. ఈ పిటిషన్‌పై విచారణను డిసెంబర్ 16కు వాయిదా వేసింది హైకోర్టు.

ఇటీవల నగర శివారు 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసిన సర్కార్.. వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు పెంచింది. డివిజన్ల క్రమం హైదరాబాద్ ఈశాన్యంలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీ నుంచి మొదలవుతుంది. దమ్మాయిగూడ జనాభా లక్ష వరకు ఉన్నందున.. దాన్ని రెండు డివిజన్లుగా విభజించారు. గ్రేటర్‌లో విలీనమైన ము




న్సిపాలిటీలు, కార్పొరేషన్లు కనీసం రెండు డివిజన్లుగా మారనున్నాయి. కాగా, వార్డుల సంఖ్య పెంపుతో సులభంగా పాలన జరుగుతుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. విభజన ద్వారా వార్డు పరిధి చిన్నదవుతుంది. దీంతో కార్పొరేటర్లు తమ వార్డులోని సమస్యలను సులభంగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ఏర్పడుతుంది. కాగా, వార్డుల డీలిమిటేషన్ ద్వారా రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 300 మంది కార్పొరేటర్లు ఎన్నికవుతారు. ప్రతి కార్పొరేటర్ తమ వార్డు అభివృద్ధిపై పూర్తి దృష్టి సారించి.. నీరు, రోడ్లు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక వసతుల విషయంలో మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుంది. అయితే, 2007లో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎంసీహెచ్‌ను చుట్టుపక్కల ఉన్న 12 మున్సిపాలిటీలతో విలీనం చేసి.. ఏకంగా 150 వార్డులతో జీహెచ్ఎంసీని ఏర్పాటు చేశారు. ఈ విస్తరణతో అప్పటి వరకు బలంగా ఉన్న టీడీపీ, ఎంఐఎంలు బలహీనపడ్డాయి. ఈ వ్యూహం ఫలితంగా 2009 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 52 సీట్లు గెలుచుకుని మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. ఇది జీహెచ్ఎంసీ చరిత్రలోనే కాంగ్రెస్‌కు అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది.

ఆ తర్వాత జరిగిన గత రెండు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైంది. 2016, 2020 ఎన్నికల్లో కేవలం రెండు సీట్లు మాత్రమే గెలుచుకుని పార్టీ బలహీనపడింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు వైఎస్సార్ 2007 ఫార్ములాను మళ్లీ అమలు చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న 150 వార్డులను ఏకంగా 300 వార్డులకు పెంచే ప్రతిపాదనపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నగర పరిధిలో ప్రస్తుతం బలంగా ఉన్న బీఆర్ఎస్, బీజేపీ కంచుకోటలను బద్దలు కొట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. శివారు ప్రాంతాల్లో కాంగ్రెస్ బలంగా ఉండగా.. దాని కోసమే కొత్త వార్డులను చేర్చినట్లు తెలిసింది. జీహెచ్ఎంసీ వార్డులను 300కు పెంచడం ద్వారా.. దాని భౌగోళిక విస్తీర్ణం 2,053 చదరపు కిలోమీటర్లకు చేరుకుంటుంది. ఈ విస్తీర్ణంతో జీహెచ్ఎంసీ దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించనుంది. ఇది ప్రస్తుత అతిపెద్ద కార్పొరేషన్లైన ఢిల్లీ 250 వార్డులు, ముంబై 227 వార్డులు కంటే కూడా విస్తీర్ణం, వార్డుల సంఖ్యలో పెద్దదిగా మారుతుంది. ఈ విస్తరణ ద్వారా రాబోయే 2026 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన పట్టును పెంచుకోవాలని.. కొత్తగా విలీనం అయ్యే ప్రాంతాల మద్దతుతో మేయర్ పీఠాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## మధు యాష్కి గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కళ్లెం సుజాత రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణ రాష్ట్ర టి పి సి సి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్ జన్మదినం సందర్భంగా రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కళ్లెం సుజాత రెడ్డి మాట్లాడుతూ..మధు యాష్కి గౌడ్ కి ఆయువు, ఆరోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే వారి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.పార్టీ పట్ల నిబద్ధతతో, ప్రజా సేవను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న మధు యాష్కి గౌడ్ సేవలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవలందించాలని కోరుకుంటూ మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు, హయత్ నగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి



**పాల్వంచ, విశాలభారతి:** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన త్యాగశీలి రాష్ట్ర సాధకుడు శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో బొల్లారిగూడెం సెంటర్ నందు గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించి , పూలమాలలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు చలవాది ప్రకాష్, కుమార్ మాట్లాడుతూ ఆనాడు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన మహా త్యాగశీలి పొట్టిశ్రీరాములు. ఈ రోజున మనం ఆంధ్రా రాష్ట్రం నుండి విడిపోయి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఎన్నో పోరాటాలు చేసి సాధించుకొని,తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసుకున్నామంటే ఇది వారి త్యాగ ఫలితమే అని అన్నారు.ఇరు రాష్ట్రాల ప్రజలు స్వతంత్ర హక్కులతో ప్రత్యేకమైన రాష్ట్రాలగా మనము ఫలితాలు అనుభవిస్తున్నామని గుర్తుచేశారు.ఆ మహనీయుని అడుగుజాడలో అందరూ నడవాలి అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షురాలు పెండ్యాల రోజాలక్ష్మి, ఆర్యవైశ్య మహాసభ టౌన్ అధ్యక్షులు తాటికొండ సురేష్ ,ఆర్యవైశ్య మహాసభ టౌన్ సెక్రెటరీ ఉప్పల వెంకటేశ్వర్లు, బచ్చు శ్రీనివాస్, వంకదార ఇందిరా రేపాక పద్మజ,గుబ్బ దుర్గా, కొప్పరపు వీరబాబు,ఆరెంజ్ మెడికల్ శ్రీనివాస్,చిల్లంచర్ల గిరిధర్,చుండూరు శ్రీనివాస్, పండ్ల కొట్టు వెంకన్న,ఆర్యవైశ్య పాల్వంచ టౌన్ సభ్యులు: నర్సింగ్ కుమార్,నెమలిపురి ఉపేందర్, తదితరులు. పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాధ్యం

- **గృహప్రవేశానికి హాజరైన పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**
- **పైలెట్ ప్రాజెక్టులో మొదలైన గృహప్రవేశాల సందడి**



**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపాడు మండలం సోంపల్లి పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు దాదాపు పూర్తయినట్లే, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల చొరవతో పేదోడి సొంతింటి కల నెరవేరడంతో ప్రతి కుటుంబం నూతన గృహప్రవేశాలలో నిమగ్నులై ఉన్నారు. సోమవారం జరిగిన నస్కూరి పద్మ,భర్త శ్రీను గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బూర్గంపాడు మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డికి గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని అన్నారు. సోంపల్లి పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎవరికైనా లబ్ధిదారులకు ఇల్లు రాకపోతే, అర్హులైన ప్రతి ఒక్కరికి రెండో విడతలో ఇవ్వనున్నట్లు సూచించారు. అనంతరం స్థానిక ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి తాటి లక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు సోంపల్లి ప్రజలను కొనియాడారు. ముందుంది మరింత మంచి కాలం అని అన్నారు. జింకలగూడెం గ్రామం నుండి సోంపల్లి గ్రామం వరకు తార్ రోడ్డు మంజూరైనట్టు తెలిపారు. రేపు జరగబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి, ప్రత్యర్థుల వెన్నులో వణుకు పుట్టించాలని వ్యాఖ్యానించారు.

## బీజేపీ బిగ్ బాస్‌గా నితిన్ నబీన్

( మొదటిపేజీ తరువాయి )

ఎదగడానికి ఒక ముఖ్యమైన దశగా మారింది. 2019 జూన్‌లో జేపీ నడ్డాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. అప్పట్లో అమిత్ షా కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో.. పార్టీ వ్యవహారాలను సమన్వయం చేయడానికి నడ్డా ఆరు నెలల పాటు కీలక పాత్ర పోషించారు. ఆ తరువాత 2020 జనవరిలో ఆయన బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి దాదాపు ఆరేళ్లుగా నడ్డా ఆ పదవిలో కొనసాగుతున్నారు. బీజేపీ రాజ్యాంగం ప్రకారం ఒక నేత మూడు సంవత్సరాల చొప్పున రెండు పర్యాయాలు పార్టీ అధ్యక్షుడిగా సేవలందించే అవకాశం ఉంది.

నితిన్ నబీన్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం తాత్కాలిక వ్యవస్థేనని పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే దీనికి వెనుక మరో కారణం కూడా ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అదేంటంటే.. హిందూ సంప్రదాయం ప్రకారం డిసెంబర్ 15 నుంచి జనవరి 14 వరకు ఖర్మాస్ కాలంగా పరిగణిస్తారు. ఈ సమయంలో శుభకార్యాలు జరుపరు. అందుకే ఖర్మాస్ ముగిసే ముందు.. అంటే జనవరి 14వ తేదీన నబీన్ పేరును ప్రకటించినట్లు సమాచారం. జనవరి 14 తర్వాత పార్టీ కొత్త జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ వేగంగా ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. బీజేపీ ఇప్పటికే 37 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 30 చోట్ల సంస్థాగత ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసింది. పార్టీ రాజ్యాంగం ప్రకారం కనీసం సగం రాష్ట్రాల్లో ఈ ఎన్నికలు పూర్తయిన తర్వాతే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరగాలి. పార్టీ వర్గాల సమాచారం మేరకు, జనవరి 14 తర్వాత నాలుగు రోజుల్లోనే అధ్యక్ష ఎన్నికను ముగించాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం ఆర్ఎస్ఎస్‌తో సంప్రదింపుల అనంతరం తీసుకున్నదేనని చెబుతున్నారు. ఆ



క్రమంలోనే, ఒకప్పుడు అమిత్ షాకు సహాయకుడిగా పనిచేసిన జేపీ నడ్డా మాదిరిగానే, నితిన్ నబీన్ కూడా కొంతకాలం నడ్డాకు సహకరిస్తూ పార్టీ వ్యవహారాలను సమన్వయం చేయనున్నారని అంచనా వేస్తున్నారు. ఇక నితిన్ నబీన్ రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడుకుంటే.. ప్రస్తుతం ఆయన బిహార్ రాష్ట్ర క్యాబినెట్‌లో రోడ్ల నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్నారు. పాట్నాలోని బంకీపూర్ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తన తండ్రి, బీజేపీ సీనియర్ నేత నవీన్ కిషోర్ సిన్హా మరణానంతరం 26 ఏళ్ల వయసులోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాయస్థ సామాజిక వర్గానికి చెందిన నబీన్, భవిష్యత్తులో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడితే, బిహార్ నుంచి ఆ పదవిని అధిరోహించిన తొలి నేతగా నిలుస్తారు. అలాగే అతి పిన్న వయసులో పార్టీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన నాయకుడిగా రికార్డు సృష్టించే అవకాశం కూడా ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా నితిన్ నబీన్‌పై ప్రశంసలు కురిపించారు. ఆయనను కష్టపడే పార్టీ కార్యకర్తగా, సమర్థవంతమైన నిర్వాహకుడిగా అభివర్ణించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయనకు ఉన్న అనుభవం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిబద్ధతతో పనిచేసే నాయకుడని మోదీ కొనియాడారు.

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**దేవరుప్పుల, విశాలభారతి:**

స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా దేవరుప్పుల మండలం,దేవరుప్పుల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జక్కుల గంగరాజు గెలుపు కోసం టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామాన్ని సందర్శించగా మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికి భారీ ర్యాలీ తీశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో కార్నర్ మీటింగ్ లో వాళ్ళు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేండ్లలో ఏ ఒక్కరికీ కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని ,ఎవరైతే కాంగ్రెస్ పార్టీ అని తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారో వాళ్ళు కాదని,అధికారం ఉన్నవాళ్ళను గెలిపించుకుంటారో లేక మహిళా సంఘాలను ఆదుకున్నవారిని గెలిపించుకుంటారో లేక మహిళలను కించపరచే వారిని గెలిపించుకుంటారో మీరే తేల్చుకోవాలని,గత ప్రభుత్వంలో మన పార్టీ వాళ్లకు సీఎమ్ఆరెఫ్ చెక్కులొస్తే పార్టీలో చేరితేనే ఇస్తామని, కానీ మన ప్రభుత్వం వచ్చినంక పార్టీలకు అతీతంతంగా అర్హులైన వారికి ఇస్తున్నామని,దేవరుప్పుల గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని,మమ్మల్ని ఎన్నిమాటలు అన్నాకూడా ఒక్క మాట కూడా మేము మాట్లాడుతలేమని,నేను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని, గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థిని



గెలిపించాల్సిన అవసరం మనందరికీ ఉందని,మన పార్టీ అభ్యర్థిని కాకుండా వేరే వారిని గెలిపించుకుంటే ఎటువంటి అభివృద్ధి జరగదని,వారికి ఓటేసి గెలిపిస్తే దిష్టిబొమ్మను కూర్చోబెట్టినట్టు కూర్చోబెట్టాలె తప్పా ఎటువంటి ఉపయోగం ఉండదని,కాంగ్రెస్ పార్టీ ఏ పరిస్థితుల్లోనైనా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కట్టుబడి ఉంటుందని,మీరందరూ కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి కేటాయించిన ఫుట్ బాల్ గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో విజయ డైరీ జిల్లా ఛైర్మెన్ కాసారపు ధర్మారెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య,మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,మండల నాయకులు బోనగిరి యాకస్వామి,రెడ్డి రాజుల రమేష్, తోటకూరి పాండు కృష్ణ,వార్డు సభ్యులు,గ్రామ నాయకులు,యువజన నాయకులు,మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రాచీన శివాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం కడవెండి సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కడవెండి గ్రామ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థి భాషిపాక బిక్షపతికి మద్దతుగా గ్రామానికి విచ్చేసిన పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రెడ్డి గ్రామంలోని ప్రాచీన శివాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రస్తుత పరిస్థితిపై గ్రామస్తులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. గత బీఆర్ఎస్ పాలనలో శివాలయానికి చెందిన భూములు కబ్జాకు గురవడం, ఆలయ పరిధిలో అన్యాయంగా దున్నివేతలు జరగడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు.శివాలయ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని, ఆలయ గౌరవాన్ని కాపాడుతూ, సంప్రదాయ వైభవాన్ని తిరిగి తీసుకువస్తామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ఎంపీ రఘురాంరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



**పాల్వంచ, విశాలభారతి:** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డిని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు నాయకత్వంలో పాల్వంచ కాంగ్రెస్ నాయకులు కలిశారు. పాల్వంచ మండల పరిధిలోని 17 పంచాయతీలలో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించిన సందర్భంగా పాల్వంచ కాంగ్రెస్ నాయకులు కొత్తగూడెం నియోజకవర్గ ఇన్చార్జ్ అయిన ఎంపీ రఘురాంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కొత్వాల ఆయనకు కాంగ్రెస్ అభ్యర్థుల విజయం విషయాన్ని విశ్లేషించారు.ఈ సందర్భంగా ఎంపీ నేతలను అభినందించారు.ఈ కార్యక్రమంలో కొత్వాలతో పాటు మాజీ జెడ్పీ చైర్మన్ బరపటి వాసుదేవరావు,మాజీ జడ్పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య, పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్, పెద్దమ్మగుడి చైర్మన్ బాలునేని నాగేశ్వర రావు, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్,కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వరరావు,డిష్ నాగేశ్వరరావు * తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సర్పంచుల పాత్ర ఎంతో కీలకం

**రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు మోత్కుపల్లి రాములు**



**మొయినాబాద్, విశాలభారతి:** గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు ఎంతో కీలకమని, సర్పంచులు పాలకవర్గంతో గ్రామాలను అభివృద్ధి చేయవలసిందిగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు మోత్కుపల్లి రాములు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోత్కుపల్లి, చందనగర్ గ్రామాల నూతన సర్పంచులను ఆయన ఘనంగా సన్మానించారు. మోత్కుపల్లి నూతన సర్పంచ్ సంపూర్ణ రాములు, చందానగర్ సర్పంచ్ మురళి కృష్ణలను ఆయన సన్మానించి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలకు సర్పంచులు ఎంతో అవసరమని తెలిపారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు సర్పంచులు పాలకవర్గంతో కలిసి కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని గ్రామాలలో ఎక్కువగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలుపొందుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే ఈ గెలుపుకు మలుపు అని అన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలను గెలుపొందిన సర్పంచులు అభివృద్ధి చేసినప్పుడే ప్రజలు గుర్తించి ఆదర్శంగా అభినందిస్తారని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేసినప్పుడే సన్మానాలు అందుకుంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో చందానగర్ మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, పూజారి రవి, చారి తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిదవ వార్డ్ మెంబర్‌గా పోలాస్ భరత్ ఘనవిజయం



**ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా**

**విశాలభారతి, మర్పల్లి:** స్థానిక సంస్థల రెండో విడుదల ఎన్నికల్లో భాగంగా మర్పల్లి మండల కేంద్రంలోని 9వ మెంబర్ గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పోలాస్ భరత్ సమీప బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పై 100 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన తొమ్మిదో వార్డ్ మెంబర్ పోలాస్ భరత్ మాట్లాడుతూ.. నా గెలుపు కోసం కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని. నన్ను నమ్మి వార్డ్ మెంబర్ గా గెలిపించిన 9వ వార్డు ప్రజలందరికీ ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాలనలో మండలం అభివృద్ధి దూసుకుపోతుందని. రాబోయే రోజుల్లో పని వినే పెరగని వీధిలో మండలం అభివృద్ధి చెందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యం అవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని మండలంలో వచ్చిన ఫలితాలే నిదర్శనం అన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారి అందరికి అందించే బాధ్యత తీసుకుంటానన్నారు.

# ప్రభుత్వ వాహన సేవల జిల్లా అధికారిగా షేక్ జాన్ షాహిద్



**విశాల భారతి మర్పల్లి:** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చెప్పట్టిన ఈ పథకాలను ప్రజలకు మరింత చేరువగా తీసుకెళందుకు కృషిచేస్తానని , అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించటం ఎంతో సంతోషంగా ఉందనిజిల్లా 108, అంబులెన్స్ 102 అమ్మఒడి 1962 పశు సంచార వాహన సేవల జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన షేక్ జాన్ షాహిద్ అన్నారు. వికారాబాద్ జిల్లాలో 17 అత్యవసర 108 అంబులెన్సు సేవలు, 8 అమ్మఒడి సేవలు 102 వాహన సేవలు మరియు 4 పశు సంచార వాహన సేవలు నిరంతరం ప్రజలకూ సేవలు అందిస్తేన్నాయని తెలిపారు.ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మరియు ఆశ వర్కర్లు ఈ సేవలను ప్రజలకు చేరువలో తీసుకెళ్లాటం లొ ప్రధాన పాత్ర పోషించి, మాత శిసు మరణాలను తగ్గిచేందుకు కృషిచేయాలనీ కోరారు. అత్యవసర పరిస్థితి ఎక్కడ జరిగిన కానీ అప్రమత్తంగా ఉండాలని, వెంటనే స్పందించాలాని 108, 102 మరియు 1962 సిబ్బందికి తెలిపారు.

# ఆలోచించండి.. వెంకటేశంను ఆశీర్వదించండి

- ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాము
- బీఆర్ఎస్ పార్టీ నాయకుడు,మాజీ సర్పంచ్ డా. వర్త్యవత్ రాజు నాయక్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి :** రేపు జరుగుతున్న మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గోరటి వెంకటేశంను కత్తెర గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామ ఓటర్లను బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నందివనపర్తి మాజీ సర్పంచ్ డా. వర్త్యవత్ రాజు నాయక్ కోరారు. సోమవారం ఉదయం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని అన్నారు. గ్రామం అభివృద్ధి, ప్రజల సంక్షేమం, యువత భవిష్యత్తు, ఇవన్నీ అత్యంత ప్రాధాన్యమైనవి. గ్రామంలో ఉన్న సమస్యలను దగ్గరగా చూసి, గ్రామ ప్రజల అవసరాలను అర్థం చేసుకుని, వాటికి శాశ్వతమైన పరిష్కారాలు చూపడానికి వెంకటేష్ పూర్తిగా సిద్ధంగా ఉన్నారన్నారు. యువతకు నైపుణ్యాలు, అవకాశాలు అవసరం. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ముందుకు సాగాలి. వృద్ధులకు ఆరోగ్య పరిరక్షణ, ఆదరణ తప్పనిసరి. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం నేరుగా అర్హులైన ప్రతి ఇంటికి చేరేలా పారదర్శక పాలన ఉండాలి. గ్రామం మొత్తం శుభ్రత, శాంతి, సౌహార్దతతో నిండిపోయేలా ప్రతి చర్య తీసుకోవడానికి మేము అందరం కట్టుబడి ఉంటాము. గ్రామ అభివృద్ధి పంథాలో ముందడుగు వేయాలంటే ప్రజల సహకారం, విశ్వాసం, ఆశీర్వాదం చాలా అవసరం. గ్రామ భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది. మనందరం కలిసి వెంకటేష్ కు ఓటు వేసి గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి దిశగా దూసుకుపోతుంది. ఇది మార్పు కాదు, శాశ్వత అభివృద్ధి అవసరం అదే బీఆర్ఎస్ సంకల్పం అని అన్నారు. కత్తెర గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని డా. వర్త్యవత్ రాజు నాయక్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డివిజన్ మార్పు–చేర్పులపై బీఎస్పీ వినతిపత్రం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఇటీవల జిహెచ్ఎంసి విడుదల చేసిన వార్డుల పునఃర్విభజన ప్రక్రియలో భాగంగా అస్తవ్యస్తంగా, ఆశాస్త్రీయంగా, సరైన అవగాహన లేకుండా పెద్ద అంబర్‌పేట్ -52వ డివిజన్, కుంట్లూర్ -51వ డివిజన్‌లను ఏర్పాటు చేశారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని బీఎస్పీ రంగా రెడ్డి జిల్లా సోషల్ మీడియా కన్వినర్ యంజాల ప్రహ్లాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వినతిపత్రంలో భాగంగా పెద్ద అంబర్‌పేట్, పసుమాముల, తారామతిపేట్, బాచారం ప్రాంతాలను కలుపుకొని పెద్ద అంబర్‌పేట్ డివిజన్-52 ను ఏర్పాటు చేయాలని, అలాగే కుంట్లూర్, హత్తిగూడ, తట్టి అన్నారం, తట్టిఖాన, కుతుబుల్లాపూర్, గౌరెల్లి ప్రాంతాలను కలుపుకొని కుంట్లూర్ డివిజన్-51 ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల సౌలభ్యం, పరిపాలనా సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని డివిజన్‌ల పునఃర్విభజన జరగాలని, ప్రస్తుతం చేసిన మార్పుల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని బీఎస్పీ నాయకులు తమ వినతిలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ రంగా రెడ్డి జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్, బీఎస్పీ సీనియర్ నాయకులు చిత్రం కృష్ణ, నాయకులు పంగ శ్రీశైలం, చ. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లే గ్రౌండ్ ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ కళ్లెం

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సోమవారం హయత్‌నగర్‌లోని పొదర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్లే గ్రౌండ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్లే గ్రౌండ్‌ను అధికారికంగా ప్రారంభించి విద్యార్థులతో మమేకమయ్యారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉత్సాహం, క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడతాయని తెలిపారు. చిన్న వయస్సు నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందిస్తే భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరచే అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా విద్యతో పాటు క్రీడలకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, డిజిటల్ వ్యసనాలకు దూరంగా ఉండి ఆటపాటల ద్వారా ఆరోగ్యంగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రతిక్ష జోహ్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు,స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీతో గ్రామాల అభివృద్ధి





- ఉద్యోగాన్ని సైతం వదులుకున్న వ్యక్తి రవీందర్
- అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపు

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

గ్రామల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి తెలగమల్ల రవీందర్ బ్యాట్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సేవకై ఉద్యోగానికి రాజీనామా చేసిన వ్యక్తి రవీందర్,కావున బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేసిందని అన్నారు.నందివనపర్తి గ్రామంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తే గ్రామంలో ఉన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి రవీందర్ మాట్లాడుతూ..అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను గ్రామంలో అమలు చేస్తానని, పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. గ్రామం అభివృద్ధి లో మరింత ముందుకు సాగాలంటే తనకు సర్పంచ్ గా ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామ మహిళలకు ఉచిత టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ నిరుద్యోగ యువతీ, యువకులకు అవకాశాలు కల్పించామని తెలిపారు. అవకాశం ఇవ్వండి అభివృద్ధికి తోడ్పడండి, ఆలోచించండి ప్రజాసేవ చేసే తెలగమల్ల రవీందర్ కు ఓటర్లు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బిలకంటి శేఖర్ రెడ్డి, మూడేళ్ల వెంకటరెడ్డి, నేర్ర భాష,గ్రామ శాఖ అధ్యక్షుడు నేర్ర శ్రీశైలం, షాహిద్,,శేఖర్,కాంగ్రెస్ నాయకులు,మహిళలు,కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అనుమతులు ఒకలా నిర్మాణాలు మరోలా!

- పక్కనే ఓ షెడ్డు సీజింగ్ చేశారు
- మరి ఈ బిల్డింగ్ ఏమన్నా సపరేట్ రూల్సా ?
- అధికారుల మౌనం.. ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**ఎల్బీనగర్ విశాల భారతి :**




నిబంధనలకు విరుద్ధంగా హయత్నగర్ సర్కిల్ 03లో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. జీ ప్లస్ టు అనుమతులతో కమర్శియల్ బహుళ అంతస్తుల భవనం నిర్మి స్తున్నారు. అక్రమ నిర్మాణాల జరుగుతున్న వాటి వెనుక అధికారుల నిర్లక్ష్యం, అండదండలు ఉన్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. విజయవాడ జాతీయ ప్రధాన రహదారి ప్రక్కన భారీ కమార్సియల్ బహుళ అంతస్తుల భవన నిర్మాణం కొనసాగుతోంది.నామ మాత్రం రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని, తర్వాత కమర్షియల్ నిర్మాణాన్ని నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి. నెలల క్రితం జీహెచ్ఎంసీ నోటీసులు ఇచ్చినప్పటికీ, దాన్ని నిర్మాణం కొనసాగించడంతో అధికారుల పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. ప్రభుత్వ ఆదా యానికి భారీ నష్టం జరుగుతున్నా చర్యలు తీసు కోవడంలో వెనకడుగు వేస్తున్నారు. ఒకవైపు ఇదిలా ఉంటే ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో వీటిపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు ఉన్న చర్యలు తీసుకోకపోవడంలో మతలాబ్ ఏందని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం : సోమశేఖర్. టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్. సర్కిల్-03**

ప్రధాన రహదారిలో రెసిడెన్షియల్ అనుమతులు పొంది వాణిజ్యపరంగా నిర్మాణాలు చేపడుతున్న బహుళ అంతస్తు నిర్మాణంపై రెండు నోటీసులు ఇవ్వడం జరిగిందని మరో రెండు రోజుల్లో ఆ భవనాన్ని పూర్తిగా సీజ్ కూడా చేయబోతున్నామని టౌన్ పాండింగ్ సెక్షన్ ఆఫీసర్ సోమశేఖర్ తెలిపారు. అంతకుముందు టౌన్ ప్లానింగ్ ఏసిపి విజయలక్ష్మి కి వివరణ కోసం ఫోన్ చేయక స్పందించకపోవడం విశేషం.

# ప్రజలకు సేవ చేసే వారినే సర్పంచులుగా ఎన్నుకోండి

**ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**విశాలభారతి , అబ్దుల్లాపూర్ మెట్టు :**



గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజలకు నిత్యం సేవ చేసే వారినే సర్పంచులుగా గెలిపించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను ఆశీర్వదించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. సంస్థాగత ఎన్నికల ప్రచారంలో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గండి చెర్వు , లష్కర్ గూడ , అనాజ్ పూర్ , మజీద్ పూర్ , జాఫర్ గూడ , బండరావిర్యాల , చిన్న రావిర్యాల , కావాడిపల్లి , బలిజగూడ తదితర గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలోని 14 గ్రామాల్లో జరగనున్న గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లను ఒక్కొక్క గ్రామానికి ఇన్‌చార్జిలుగా నియమించి, ఆయా గ్రామాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమన్వయంతో కృషి చేయాలని ఆయన సూచించారు.గ్రామాల సర్వాంగీణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే రంగారెడ్డి, ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించే నాయకులకు అవకాశం ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమం లో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రైతు సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్పర్సన్ పండుగల రాజు,వైస్ చైర్మన్ చామ విజయ శేఖర్ రెడ్డి, హయత్ నగర్ రైతు సహకార సంఘం చైర్మన్ చామ కృష్ణ రెడ్డి ,మాజీ కౌన్సిలర్లు వడేపల్లి విద్యా విజయేందర్ రెడ్డి, రాజేందర్ ముదిరాజ్, సిద్దంకి కృష్ణ రెడ్డి,గంట లక్ష్మ రెడ్డి,సంఘం డైరెక్టర్ గంట శ్రీనివాస్ రెడ్డి, ముత్యాల రాజశేఖర్, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సోమార్పేట్ ఘటన దురదృష్టకరం

**ఎల్లారెడ్డి విశాలభారతి:**




ఎల్లారెడ్డి మండలం సోమార్పేట్ గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న సంఘటన అత్యంత దురదృష్టకరమని, భాదాకరమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు స్పష్టం చేశారు. ఈ మేరకు వీడియో సందేశం ద్వారా స్పందించిన ఎమ్మెల్యే, ఈ ఘటనపై తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు కారణమైన వారు ఎంతటి వారైనప్పటికీ వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే స్పష్టంగా హెచ్చరించారు. చట్టం ముందు అందరూ సమానమేనని పేర్కొంటూ, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు ఇప్పటికే విచారణ చేపట్టారని, తాను కూడా పోలీసు అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. బాధ్యులను గుర్తించి, చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు భరోసా ఇచ్చారు. గ్రామంలో శాంతి భద్రతలు కాపాడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.

# గ్రామాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు కృషి చేస్తా

**తొమ్మిదిరేకుల గ్రామ సర్పంచ్ కవితకరుణాకర్ రెడ్డి**



**కేశంపేట,విశాలభారతి:** గ్రామస్తులందరూ తనను సర్పంచ్ గా ఎన్నుకోవడం ద్వారా గ్రామానికి సేవ చేసే అవకాశం కల్పించారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామస్తులందరి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు కృషి చేస్తానని తొమ్మిదిరేకుల గ్రామ సర్పంచ్ బీస కవితకరుణాకర్ రెడ్డి అన్నారు.గ్రామములోని ఎ స్సీ కాలని దగ్గర ఉన్న వాటర్ ట్యాంక్ నిండినప్పుడు ఓవర్ ఫ్లో అయిన నీళ్లు ట్యాంకు చుట్టుపక్కల నిలిచి గుంతలు నిండి రోడ్ల పై నీరు పారుతున్న విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ వాటర్ ట్యాంక్ పరిసరాలను పరిశీలించి మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అవినాష్ గౌడ్, ఉప సర్పంచ్ ఉడ్తావత్ రవి నాయక్,వార్డు సభ్యులు లచ్చి రాంనాయక్,కావలి వసంతసత్తయ్య, పొగుల నర్సింలు, పొగుల నరేష్, కందెన సంతోష శివయ్య, గుత్తి చంద్రయ్య ,నాగిళ్ల ప్రేమలత యాదయ్య, గ్రామస్తులు చిట్టిరెడ్డి వెంకట్ రెడ్డి ,గుత్తి రంగయ్య ,భీమ్ రెడ్డి సుధాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, బీసా గోవర్ధన్ రెడ్డి, ఏనుముల పాండురంగారెడ్డి, కానుగుల చెన్నయ్య , నాగిళ్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మధుయాష్కిగౌడ్ జన్మదిన వేడుకలు



**ఎల్బీనగర్. విశాలభారతి:** టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. హయత్ నగర్ టీ నగర్ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలలో.. ఎల్బీనగర్ నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో తరలివచ్చి మధుయాష్కి గౌడ్ కి శుభాకాంక్షలు తెలిపారు. పూల బొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు. నాగోల్ బండ్లగూడ లోని వాత్సల్యం అనాధాశ్రమ చిన్నారుల మధ్య కేక్ కోసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కాగా తన జన్మదినాన్ని పురస్కరించుకొని మధుయాష్కి ఎల్బీనగర్లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. జన్మదిన వేడుకల్లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి , పార్టీ నేత ముద్దగోని రామ్మోహన్ గౌడ్ , పీసీసీ ప్రధాన కార్యదర్శులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా , పృథ్వీ చౌదరి, కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్ రెడ్డి , రాగుల వెంకటేశ్వర్ రెడ్డి , మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్ గౌడ్, ముద్దగోని లక్ష్మీ ప్రసన్న , ముద్రబోయిన శ్రీనివాసరావు, ఆయా డివిజన్ల అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి గారు శశిధర్ రెడ్డి,వేణుగోపాల్ యాదవ్,చెన్నగోని రవీందర్ గౌడ్, బుడ్డా సత్యనారాయణ , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, పన్యాల జైపాల్ రెడ్డి , కర్మాన్ఘాట్ హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్ ఎల్బీనగర్ అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, నాయకులు పర్వతి గణేష్ రెడ్డి , భీమిడి రామకృష్ణారెడ్డి , రవీందర్ గౌడ్, రజిని రావు, రాజేశ్వరి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కర్క పెంటయ్య జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి, విశాలభారతి:** కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కర్క పెంటయ్య జన్మదిన వేడుకలను భరత్ నగర్ కాలనీ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెంటయ్య జన్మదినోత్సవాన్నీ ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు మానిక్ రెడ్డి శాలువా తో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. అసోసియేషన్ సభ్యులైన కర్క పెంటయ్య,వెంకట్రావు జన్మదినోత్సవాన్ని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. అనంతరం సీనియిర్ సిటిజెన్ సభ్యులకు భోజనాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంగం అధ్యక్షులు పి. నాగిరెడ్డి, సీనియర్ సిటిజెన్ ప్రధానకార్యదర్శి కోటేశ్వర్ రావు,కోశాధికారి ప్రసాద్, సలహాదారులు చన్నకేశవులు, కర్కడాకయ్య,బిక్షపతి,కూకట్పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు కర్క నాగరాజు,విజయ్ కుమార్, మల్లేష్, నారాయణ, జిల్లా గోపాల్,కర్క స్వామి,కర్క రామకృష్ణ, జెల్ల రాము,అంబేద్కర్ అమరజ్యోతి అసోసియేషన్ అధ్యక్షులు కర్క నిఖిల్, టీంకు, జెల్ల సాయి, కృష్ణా, నాగార్జున, వెంకన్న డాన్, చారీ, తదితరులు పాల్గొన్నారు.

# అనగనగా ఓ "గోరింటాకు"

- పాలన నీడలేక ప్రజల నరకయాతన
- డబ్బునోడిదే పెత్తనం.., పేదోడి గూడు కలగానే మిగిలిందా..?
- చరిత్రతో నిండిన గోరింటాకు గ్రామం
- అన్ని ఉన్నా... అభివృద్ధి మాత్రం కనిపించని వైనం.
- పాలకులు మారినా... ప్రజల కష్టాలు మారలేదు.
- చరిత్ర ఉన్న ఊరే అయినా...,  పేదలకు మాత్రం గూడు లేదు.
- ఆ "దొందు దొందే" ఈసారి పేదోడికే పట్టం?



**మహబూబాబాద్, విశాలభారతి:**

చింతచెట్టు నీడలో నానమ్మ చుట్టూ కూర్చున్న ముద్దుబిడ్డల మాటలతో మొదలైన ఓ కథ...కానీ అది కథ కాదు..., ఒక నియోజకవర్గంలో చరిత్ర కలిగిన "గోరింటాకు" ఊరు ప్రజల నిజమైన జీవన గాథ..., "నానమ్మ... కథ చెప్పు...!" అన్న పిల్లల కోరికతో మొదలైన ఈ గోరింటాకు కథ, పాలకుల నిర్లక్ష్యంతో పల్లెల్లో నలిగిపోతున్న ప్రజల బతుకులను అద్దంలా చూపించింది.

**చరిత్రతో నిండిన గోరింటాకు గ్రామం..,**

అనగనగా... "గోరింటాకు" అనే పేరున్న ఓ గ్రామం. చారిత్రాత్మక ఆలయం, పురాతన సంస్కృతి, విశాలమైన పెద్ద చెరువు ఈ ఊరి ప్రత్యేకతలు. మూడు కళ్లతో, పది చేతులతో విరాజిల్లే త్రినేత్రుడికి అంకితమైన ఈ ఆలయాన్ని క్రీ.శ. 900లో ఓ రాజు నిర్మించాడని చరిత్ర చెబుతోంది. కాకతీయుల పాలనలో ఈ ఆలయం పునరుద్ధరణకు నోచుకుంది. అప్పటి రాజధానిగా ఉన్న కారణంగా ప్రసిద్ధ యాత్రికుడు మార్కో-పోలో కూడా ఈ ఆలయాన్ని ప్రస్తావించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఆలయం సమీపంలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన పెద్ద చెరువు ఉంది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి అన్ని అవకాశాలు ఉన్నా...ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చే హామీలు, పాలకుల నిర్లక్ష్యం వల్ల అవన్నీ ఫైళ్లకే పరిమితమయ్యాయి.

**పండుగలు, పంటలు, ప్రజల జీవనం..**

మహాశివరాత్రి పండుగ కురవిలో అతిపెద్ద వేడుక. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలను ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. పత్తి, మిరప పంటలే రైతులకు ప్రధాన ఆధారం. ప్రతి వారం జరిగే పెద్ద పశువుల అంగడి ప్రాంతవ్యాప్తంగా ప్రసిద్ధి. అన్ని ఉన్నా... అభివృద్ధి మాత్రం కనిపించని వైనం.

**ఎక్కడ వేసిన గొంగళి... అక్కడే**

ఉమ్మడి రాష్ట్రంలో ఆలయం, పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామంటూ పలుమార్లు చెట్లు తొలగించి, మట్టి పోసి చేతులు దులుపుకున్నారు. నూతన రాష్ట్రం ఏర్పడ్డాక ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు అయినా..., పాలక మండలి ఉన్న పనులు ఎక్కడా కనిపించలేదు. పెద్ద చెరువు నిర్లక్ష్యానికి గురై, అంగడి పట్టించుకునే నాధుడే లేకుండా పోయింది. గత పాలకులు చెరువు గట్టుపై బతుకమ్మ విగ్రహం ప్రతిష్టించి ప్రజల హామీలు నిలుపుకున్నారు. గత ఆలయ చైర్మన్ పాలక మండలి అయంలో అభివృద్ధి నోచుకోలేదు. ఇదిలా ఉండగా ఆలయం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల కబ్జా ఆరోపణలు ప్రజల్లో ఆగ్రహం రేపుతున్నాయి. ఆలయానికి దశాబ్దాల చరిత్ర గలదు కాకతీయుల కాలంలో స్వయంభుగా వెలిసినట్టు చరిత్రకారులు చెబుతున్నారు. కానీ కొందరు దుర్బుద్ధితో పైసలే ప్రథమార్థంలో వక్రబుద్ధిని అవలంబిస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని కొంతమంది వ్యక్తులు ప్రైవేట్ లాడ్జి ల పేరుతో ప్రేమ జంటలకు, వివాహిత అవివాహిత జంటలకు ఆశ్రయం కల్పిస్తూ వ్యభిచారాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో చరిత్ర ఉన్న గోరింటాకు ఊరు ప్రతిష్ట పరువు తీస్తున్నారు.

**పాలకులు మారినా..., ప్రజల కష్టాలు మారలేదు**

ఈ పరిస్థితుల్లో ప్రజలు మరో నాయకుడికి అవకాశం ఇచ్చారు. కానీ రెండు సంవత్సరాలు గడిచినా అభివృద్ధి జాడ కనిపించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. "తుంటెత్తేసి... మొద్దెత్తుకున్నట్టే" అంటూ పాలనపై "దొందు దొందే" అంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**గూడు లేని పేదల వేదన..**

చరిత్ర ఉన్న ఊరే అయినా..., పేదలకు మాత్రం గూడు లేదు. ఇప్పటికీ చాలామంది పేదలు పూరి గుడిసెల్లో జీవనం, మరికొందరు కిరాయి గదుల్లో నలుగుతున్నారు. గత పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కొంతమందికి మాత్రమే మంజూరయ్యాయి. అందులో ఎక్కువగా డబ్బున్నవారే లబ్ధిపొందారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పాలకులు డబ్బులున్నోళ్లకే మళ్ళీ ఇండ్లు మంజూరు చేస్తున్నారు. పేదలకు ఇవ్వాల్సిన ఇళ్లను పొందిన నాయకులే ఇప్పుడు..., పేదల ఇళ్లకే ఓట్ల కోసం వస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు.

**ఈసారి పేదోడికే పట్టం?**

స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆ "దొందు.., దొందే" మూడో వ్యక్తి నిరుపేద సర్పంచ్ అభ్యర్థికి ఓటు వేయాలనే చర్చ గ్రామమంతా నడుస్తోందని నానమ్మ కథ ముగించింది. ఇది కథలా వినిపించినా..., గోరింటాకు గ్రామ ప్రజల గుండెల్లో నలుగుతున్న నిజం. ఇది కేవలం నానమ్మ చెప్పిన కథ కాదు..., పల్లెల్లో పాలనను ప్రశ్నిస్తున్న ప్రజల స్వరాజ్య గాథ. ఆ "దొందు.., దొందే" ఈసారి మూడో వ్యక్తి పేద సర్పంచ్ అభ్యర్థి కి పట్టం కట్టాలనే ఆలోచన ఉన్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతుంది.

## వార్డుల పున్నర్విభజనలో లోటుపాట్లను సర్దుబాటు చేయాలి

- కార్పొరేటర్ సుజాత నాయక్
- జిహెచ్ఎంసి సెంట్రల్ ఆఫీస్లో వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్లు.



**ఎల్బీనగర్, విశాలభారతి :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల జరిగిన వార్డుల పున్నర్ విభజనలో లోటుపాట్లను సర్దుబాటు చేయాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ ఎమ్మెల్యేలు కార్పొరేటర్లు కలిసి జిహెచ్ఎంసి కమిషనర్ కర్నల్ ని కోరినట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలో సర్దుబాటు చేసే విధంగా కృషి చేస్తానని ఆమె ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా రథోత్సవం



**కేశంపేట,విశాలభారతి:** మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలోని నంబాయగుట్టపై వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. సోమవారం తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. రథంపై ఉత్సవ విగ్రహాలు ఉంచి గ్రామంలోని పురవీధుల గుండా రథాన్ని ఊరేగించారు.చిన్నారులు, భక్తులు పోటీపడి రథాన్ని ముందుకు లాగారు.రథోత్సవం సాగినంత సేపు భక్తుల నినాదాలు, కేరింతలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. రథోత్సవంలో భాగంగా కళాకారులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావలి సువర్ణచిన్ననరసింహులు, మాజీ సర్పంచ్ మంజులమల్లేష్,ఉప సర్పంచ్ కాట్రావత్ రమేష్,గ్రామస్తులు చిర్ర శ్రీను, మనోహర్ గౌడ్, ఆనంద్, మహిళలు, భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న జాఫర్ గూడ కాంగ్రెస్ అభ్యర్థి

**ఎర్ర వెంకటేష్ యాదవ్**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం జాఫర్ గూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఎర్ర వెంకటేష్ యాదవ్ ఎన్నికల ప్రచారంలో ముందు వరుసలో దూసుపోతు ప్రజల మన్ననలు పొందుతున్నారు. చివరి రోజు నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయన ఓటర్లను కలిసి, పార్టీ ఎన్నికల గుర్తు కత్తెర పై మీ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. తనను గెలిపించిన అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. గతంతో పోలిస్తే గ్రామాభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తూ, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో సమన్వయంగా పనిచేస్తానని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎన్నికల ఇంచార్జి పండుగల రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం జంగా రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అదేవిధంగా మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రచారానికి మద్దతు తెలిపారు.

## లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సుదర్శన హోమం

**ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** శ్రీశ్రీశ్రీ స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో( గౌరెల్లి గుట్ట) స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నేడు 16.12.25న ఉదయం 8 గంటల సమయంలో లక్ష్మీ నరసింహ స్వామి వారికి అభిషేకం సుదర్శన హోమం కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరు రాజు తెలిపారు, ఇట్టి కార్యక్రమానికి సమస్త గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు వివిధ పార్టీల నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు,మహిళా సంఘ నాయకురాలు, యువజన సంఘాల నాయకులు, యువతి యువకులు ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ స్వయంభు స్వర్ణ గిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విచ్చేసి ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ చెంచల శ్రీనివాస్, డైరెక్టర్లు నీడూరు రాజు ,గ్యార దివ్యదాస్, చిట్టి గారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

- తండ్రికి తీవ్ర గాయాలు
- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంబీబీఎస్ చదువుతున్న యువతి మృతి చెందగా, ఆమె తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. ఇన్స్పెక్టర్ వివరాల ప్రకారం... ఈరోజు ఉదయం సుమారు 7 గంటల సమయంలో వినాయక నగర్, హయత్‌నగర్‌కు చెందిన యంసాని పాండు (50) తన కుమార్తె యంసాని ఐశ్వర్య (19) ను కాలేజీకి పంపించేందుకు ఆర్టీసీ కాలనీ సమీపంలో రోడ్డు దాటుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్‌లో ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఐశ్వర్యతో పాటు ఆమె తండ్రి కలిసి రోడ్డు క్రాస్ చేస్తుండగా, ఎల్బీనగర్ వైపు నుంచి హయత్‌నగర్ దిశగా అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన క్రెటా కారు (నంబర్ TS 07 KG 9006) వారిని ఢీకొట్టిన అనంతరం ఆగకుండా వెళ్లిపోయిందని, ఈ ప్రమాదంలో యంసాని ఐశ్వర్యకు తలకు తీవ్రమైన గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, యంసాని పాండుకు ఎడమ కాలు విరిగింది. ప్రస్తుతం ఆయన నీలాద్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ ఘటనపై బాధితుడు యంసాని పాండు అన్నయ్య సోమ వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ వెల్లడించారు. నిందితుడిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సిరిపురం ఉప సర్పంచ్‌గా దీదాని రత్నం



**విశాలభారతి, మర్పల్లి:** మండలంలో ఆదివారం స్థానిక సంస్థల రెండో విడుదల ఎన్నికలు జరిగాయి. సిరిపురం గ్రామ పంచాయతీని లో సర్పంచ్ అభ్యర్థులుగా ఐదుగురు పోటీలో ఉండగా బి ఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మర్రి సంగీత కృష్ణారెడ్డి గెలుపొందారు. ఉప సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన దీదాన్ని రత్నం ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఉప సర్పంచ్ గా ఎన్నికైన దీదాని రత్నం మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి నన్ను ఉపసర్పంచ్ గా ఎన్నుకున్న వార్డ్ మెంబర్ లందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ గ్రామంలో తాగునీటి డ్రైనేజ్ మురికి కాలువల శుభ్రత తదితర వంటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిని నిర్మూలించే విధంగా కృషి చేస్తానన్నారు. నా గెలుపులో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటాను అన్నారు. గ్రామంలోని ఎవ్వరికీ ఏ కష్టం వచ్చినా తీర్చడానికి ముందుంటానని ఆయన అన్నారు.

## అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగా రెడ్డి జిల్లా పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్ గ్రామం ఒకటో వార్డులో శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తాజా మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ (పేరు స్వామి) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్సనల్ పిఏ సైదులు కత్తి స్వామి హాజరయ్యారు. వారు హరిహర పుత్ర అయ్యప్ప స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజుగౌడ్, మున్సిపల్ ఛైర్పర్సన్ చామ విజయ్ శేఖర్ రెడ్డి,పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బాటసింగారం రైతు సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు సిద్ధాంతి కృష్ణారెడ్డి, సుప్రసేనారెడ్డి , పసుల రాజేందర్ ముదిరాజ్, వేణుగోపాల్ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ ముత్యాల రాజశేఖర్, గంట శ్రీనివాస్ రెడ్డి, గంట లక్ష్మారెడ్డి, అశోక్,దండెం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దండెం రాం రెడ్డి అలాగే అయ్యప్ప స్వామి భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుంట్లూర్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవా చేస్తా

**తోర్మామిడి సర్పంచ్ సంజీవయ్య**



**బంట్వారం, విశాలభారతి:** రెండవ విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బంట్వారం మండల కేంద్రంలోని తోర్మామిడి గ్రామంలో ఊహించని విధంగా ఫలితాలు వెలువడ్డాయి. గ్రామ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి యం.సంజీవయ్య గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ యం.సంజీవయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే తోర్మామిడి గ్రామ ప్రజల సహకారం ప్రధానంగా యూత్ మంచిగా సహరించారని నా విజయంలో వారు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమిష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం నమ్మకంతో ఎన్నుకునేందుకు ప్రజలకే అంకితమై పనిచేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## రంగయ్యపల్లి సర్పంచ్‌గా కుసునం నిర్మల రవీందర్ రెడ్డి

**హైదరాబాద్, విశాలభారతి:** రాష్ట్రంలో జరిగిన రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం రంగాయపల్లి సర్పంచ్ గా కుసునం నిర్మల రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం జరిగిన ఎన్నికల కౌంటింగ్ లో 44 ఓట్లతో నిర్మల రవీందర్ రెడ్డి గెలుపొందినట్టు అధికారులు ప్రకటించి సర్టిఫికెట్ ను అందజేశారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే హరీష్‌రావు వారిని అభినందించారు. ఈ సందర్భంగా తన గెలుపుకు సహకరించిన ఊరు ప్రజల అందరికీ నిర్మల రవీందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



## ఘనంగా శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ మూడవ వార్షిక మహోత్సవం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్మెట్ మండలం, తారామతిపేట్ గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వార్షిక మహోత్సవం, 18 మెట్ల మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా 18 మెట్ల మహా పడి వెలిగించే కార్యక్రమాన్ని కత్తి స్వామి మర్రి కార్తీక్ రెడ్డి నిర్వహించగా, నిత్య అన్నదాన ప్రదాతగా బోగురంపేట జైపాల్ రెడ్డి సేవలందించారు. గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.దేవాలయ ధర్మకర్త, ఆలయ ప్రధాన గురుస్వామి దుబ్బ సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో తారామతిపేట్ గ్రామ మాజీ సర్పంచ్ మూల మహేష్ గౌడ్, అబ్దుల్లాపూర్ మెట్టు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల భాస్కర్ గౌడ్, బాటసింగారం రైతు సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, డైరెక్టర్ ముత్యాల రాజశేఖర్, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## మునగాల సర్పంచ్ ఫలితాల ప్రకటనలో అధికార దుర్వినియోగం



- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్
- అక్రమ మార్గంలో అర్ధరాత్రి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచినట్లుగా ప్రకటించడం అన్యాయం

**కోదాడ, విశాలభారతి:**

మునగాల గ్రామపంచాయతీకి గత ఆదివారం జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వేట నాగలక్ష్మి విజయంసాధించినప్పటికీ కావాలని డబ్బు అధికారబలంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల ద్వారా స్థానిక ఎన్నికల అధికారితో ఫోన్లో రాయబారాలు నడిపి అక్రమంగా అర్ధరాత్రి వేళ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నల్లపాటిప్రమీల ఐదు ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ప్రకటించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్ అన్నారు, సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఎన్నికలసందర్భంగా గ్రామప్రజలు ఇచ్చిన ప్రజాతీర్పును గౌరవించకుండా అడ్డదారుల్లో అధికారంకోసం ఆరులుచాస్తూ ఓడిపోతున్నామని ముందే గ్రహించి పెద్ద ఎత్తున పోలీసు బలగాలను రంగంలోకిదింపి స్థానిక బిఆర్ఎస్ పార్టీనాయకులన్యాయసమ్మతమైన రీకౌంటింగ్ నిర్వహణ నియమ నిబంధనలు కూడా పక్కనపెట్టి అధికార పార్టీకి స్థానిక ఎన్నికల అధికారులు సైతం దాసోహమై అందరూ కలిసి అడ్డదారుల్లో అర్ధరాత్రి వేళ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటించుకోవడం ప్రజాస్వామ్యాన్ని ప్రజలు వినియోగించుకున్న ఓటు హక్కును దుర్వినియోగం చేయడమేనని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు, మునగాల గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన ఎన్నికల తీరును ప్రజలందరూ గమనిస్తున్నారని ప్రజాక్షేత్రంలో తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలు బుద్ధి చెబుతారని తమ పార్టీ అభ్యర్థి వేట నాగలక్ష్మి నైతికంగా విజయం సాధించిన అధికార దుర్వినియోగంతో కాంగ్రెస్ పార్టీ సర్పంచిగా గెలిచినట్లు ప్రకటించుకున్న విధానంపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఎన్నికల ఫలితాల రీకౌంటింగ్ నిర్వహణకు న్యాయపోరాటం చేస్తామని వారు తెలిపారు, ఈ సమావేశంలో మునగాల పిఎసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉదుం కృష్ణ, పార్టీ నాయకులు ఎల్ పి రామయ్య, వేట శివాజీ,దొంగరి శ్రీను,వసంత కుమార్, అమర్నాథ్, మనోజ్, నల్లపాటి నాగరాజు, జానీ, సైదా, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## ట్రెండింగ్‌లో లావణ్య త్రిపాఠి

# స్పెషల్ లుక్

టాలీవుడ్ భామ లావణ్య త్రిపాఠి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం సతీలీలావతి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్.. టీజర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. మేకర్స్ సతీలీలావతికి బర్త్ డే విషెస్ తెలియజేస్తూ లావణ్య త్రిపాఠి కొత్త పోస్టర్ షేర్ చేశారు. ఇప్పటికే మేకర్స్ చిత్తూరు పిల్ల లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేయగా..లావణ్య త్రిపాఠి పెళ్లి కూతురిలా మారిపోయి పాడుకుంటున్న ఈ సాంగ్ సినిమాపై మూవీ లవర్స్‌లో ఆసక్తిని పెంచుతోంది. వనమాలి రాసిన ఈ పాటను మిక్కీ జే మేయర్ కంపోజిషన్‌లో నూతన మోహన్, కృష్ణ తేజస్వి, రితేశ్ జీ రావు పాడారు. లావణ్య త్రిపాఠి ఈ పాటలో సూపర్ గ్లామరస్‌గా కనిపిస్తూ అభిమానులు, ఫాలోవర్లను ఖుషీ చేస్తోంది. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టీ సంయుక్తంగా నిర్మిస్తుండగా.. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నాడు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.